

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 28 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

మిట్ట మధ్యాహ్నపు జాడలు తెలియని చిక్కని అడవిలో ఒంటరిగా సాగుతున్నాడా వ్యక్తి. పాతిక సంవత్సరాల పడుచుదనంతో మిసమిసలాడుతున్నాడు. చురుకైన కనులు, దృఢమైన భుజాలు, కొనదేలి వంపు తిరిగిన నాసిక రాజసాన్ని చిందిస్తున్నాయి. భుజాలదాకా వ్రేలాడుతున్న జడలు, తాపసిలా ముడివేసిన కొప్పులో, మెడలో వ్రేలాడుతున్న తామరపూసల దండలు సాత్త్విక ప్రభలను వెలువరిస్తున్నాయి. ఎడమచేతిలో ధనుస్సును బిగించి పట్టుకున్నాడు. కుడిచేతిలో కాలపాశంలా మెరుస్తున్నది పదునైన బాణం. మధ్య మధ్య అడ్డు తగులుతున్న అడవి తీగలను ఆ బాణంతో తొలిగిస్తూ నిర్వికారంగా ముందుకు సాగుతున్నాడు. అతని కుడి మూపున బరువుగా వ్రేలాడుతున్నది అమ్ములపొది. రంగురంగుల ఈకలతో పడగలెత్తిన త్రాచుల్లా ఉన్నాయి అమ్ములపొదిలోని పదునైన బాణాలు. కుడిభుజం మీదుగా ఎడమవైపుకు నడుమున వ్రేళ్ళాడుతున్న గుడ్డసంచీలోనుండి తపోదండం కనిపిస్తున్నది. బరువుగా కమండలం కదలాడుతున్నది. ధనుర్బాణాలు ధరించిన బ్రహ్మలా ఉన్నాడు అతడు. దండ కమండలాలు ధరించిన దాశరథిలా వున్నాడు.

నడినెత్తిన మండుతున్న గోళంలా ఉన్న సూర్యుని వేడిమి సోకకుండా దట్టంగా ఆకాశానికి అంటుతున్న భారీ వృక్షాలు పందిరివేసినట్లు అల్లుకుని వున్నాయి. అంతరంగంలో అలుముకున్న అహంకారంలా మధ్యాహ్నమే మసక చీకట్లు కమ్ముకున్నాయి అడవిలో. వెట్టితలలు వేసే స్వార్థంలా

దృఢమైన కొమ్మలను సాచి ఎదిగిన నానాజాతుల పెనువృక్షాలు భయం కొలిపేలా ఉన్నాయి. నిర్భయంగా, నిదానంగా ముందుకు సాగుతున్నాడు అతడు. పాపిష్ఠి అంతరంగంలో పశ్చాత్తాపంలా అప్పుడప్పుడు ఆకులమధ్యనుండి పదునైన సూర్యకిరణాలు తాకుతూ మెరుస్తున్నాయి. ఆకాశం కనబడకుండా వృక్షాలు, నేల కనబడకుండా చిక్కగా అల్లుకుని ఉన్నతీగలు, ఆకుపచ్చని తివాచీలాగా దట్టంగా పరుచుకున్నఆకులతో భూమ్యాకాశాల పరిచయం లేని కొత్త లోకంలా ఉన్నదా అడవి.

కొమ్మలనుండి కొమ్మలకు దూకుతున్న చిత్రమైన కోతుల అరుపులు, ఎక్కడో దూరంగా మదగజాలు చేస్తున్న ఘీంకారాలు మధ్య మధ్యన వినబడుతూన్నాయి. అలికిడికి అణిగిపోతున్న కీటకాల ధ్వనులు నిశ్శబ్దాన్ని మరింత గంభీరంగా నిలబెడుతున్నాయి. ఉన్నట్టుండి ఒక విశాలమైన వృక్షశాఖ మీద ప్రత్యక్షమైంది వింత కోతి. సింహంతోక లాంటి తోక, జూలు విదిలిస్తూ నాలుగు కాళ్ళమీద గంతులు వేస్తూ విచిత్రంగా అరిచింది అడవి దద్దరిల్లేలా. మరుక్షణం పదుల సంఖ్యలో ప్రత్యక్షమయ్యాయి దాని సహచరులు. తీగలు పట్టుకుని వ్రేళ్ళాడుతూ కొమ్మనుండి కొమ్మకు దూకుతూ చెట్లమీదుగా అతడిని అనుసరించడం మొదలెట్టాయి.వాటి అరుపులతో అడవి ఉలిక్కిపడి మేలుకున్నట్లు అనిపించింది. అతడు చలించలేదు. చిరునవ్వులతో వాటిని పలకరిస్తూ ముందుకు సాగుతూనే ఉన్నాడు. కొంతదూరం అనుసరించి సింహోల్లాంటి కోతులు కొమ్మలమీద ఆగిపోయాయి, గురగురలాడుతూ. అలసట అంటే ఏమిటో తెలియనట్లు ఆ యువకుడు సాగిపోతున్నాడు. ముదిరిన మధ్యాహ్నపు ఎండ చెదిరి సాయంకాలపు ఎండగా మారేవరకూ ఆగకుండా నడిచాడు.

ఇప్పుడు భారీ వృక్షాల జాడలు పలుచనయ్యాయి. దట్టమైన పొదలు గుబురుల మాటున దూరంగా మెలికలు తిరుగుతూ మిలమిలలాడుతూ పంపానది దర్శనమిస్తున్నది. గాలివాటుకు లీలగా ప్రవాహపు ధ్వనులు కూడా వుండీ వుండీ వినిపిస్తున్నాయి. ఇప్పుడు సాయంకాలపు సిందూరవాహినిలా కనిపిస్తున్నది పంపానది. అటువైపు తీరంలో మసక మసకగా కనిపిస్తున్న కొండల మీదినుండి, అడవుల నుండి సన్నని సాయంకాలపు పొగలు రేగుతున్నాయి. రెండు చేతులు జోడించి ఆ బ్రహ్మకుమార్తెకు, శివపత్నికి, పంపానదికి నమస్కరించాడు ఆ యువకుడు.

అడవిబాట ఇప్పుడు చదునుగా మారింది. అల్లంతదూరంలో తలలూపుతున్న వందల సంఖ్యలోని కొబ్బరిచెట్లమధ్య పర్ణశాలలలాంటివి కనిపిస్తున్నాయి. ఎటుచూసినా పచ్చదనం, చిన్నా పెద్దా కొలనులు పరవశింపజేస్తున్నాయి. మలబారుప్రకృతి పచ్చని వలువలు కట్టిన పడుచులా వున్నది. నీటి నీలిమల నిగారింపుతో చామనఛాయల సొగసుకత్తెలా వున్నది. సాయంకాలం వేగంగా రాత్రిలోకి జారుతున్నది. మినుకు మిణుకుమంటూ అక్కడక్కడా చమురుదీపాల కాంతులు చుక్కల్లా పొడిచాయి. నాలుగుప్రక్కలా వ్యాపించిన నీటి వనరుల చెమ్మ ఇంతలోనే గాలిలో తెలుస్తున్నది. వేప, మద్ది, కానుగ, అవిసె, మఱ్ఱి వృక్షాల బదులుగా యిప్పుడు చూసినంత మేరా కొబ్బరి చెట్లు కొమ్మల చేతులు సాచి నాట్యం చేస్తూ కనిపిస్తున్నాయి. నీళ్ళమీద తేలుతున్న పడవ ఇళ్ళు నీరెండలో మెరుస్తున్నాయి. ఒకటొకటిగా పడవలయిళ్ళు చమురుదీపాలతో గుప్పున వెలగడం ప్రారంభించాయి.

ఇప్పటికి ఒక కాలిబాట కనిపించింది ఆ యువకుడికి. అటూ యిటూ రంగురంగులపూలచెట్ల మధ్యగా ఆ కాలిబాటను అనుసరించాడు. చిన్న చిన్న గుట్టలమీద, పల్లపు ప్రదేశాలలో తీర్చి దిద్దిన బొమ్మరిళ్లలాంటి యిళ్ళు. పొదరిళ్ళలాంటి వెదురిళ్ళు. అప్పుడప్పుడు బయటికి వచ్చి విచిత్రంగా చూస్తున్న వారిని గమనిస్తూ ముందుకు నడిచి ఒక పొడవాటి కఱ్ఱవంతెనను సమీపించాడు. గాలికి ఊయలలూగుతున్నట్లున్న కఱ్ఱవంతెన మీదుగా అడుగులేశాడు.

వెంబనాడు సరస్సు నీలి వర్ణంలో మెరిసిపోతున్నది వంతెనకింద. కనుచూపుమేరా రకరకాల ఆకృతులలో, చిన్న పెద్ద పడవల యిళ్ళు కనిపిస్తున్నాయి. కొన్ని మూడు నాలుగు అంతస్తుల పడవయిళ్ళు. కొన్నిటికి విశాలమైన లోగిళ్ళు, కొన్ని వెదురు గుడిసెల లాంటి చిన్న చిన్న యిళ్ళు. పది మైళ్ళ వెడల్పు, డెభ్భై మైళ్ళ పొడవున దక్షిణ భారతాన వెలసిన అత్యంత పొడవైన సరస్సు వెంబనాడు సరస్సు. పంపా ధారలతో పాదుకుని, సంవత్సరం పొడవునా పది నదుల జలధారలతో సమృద్ధమైన సరస్సు వెంబనాడు. ఉపాసకులకు, యుద్ధకళలకు, భావుకులకు, భవానీ దాసులకు ఆటపట్టు వెంబనాడు సరస్సులోని దీవులు. తంత్ర మంత్ర శాస్త్రాలకు, మర్మయుద్ధ శాస్త్రానికి పుట్టినిళ్లు వెంబనాడు సరస్సుదీవులు.

ముచ్చటగా మూడు దీవులను ఒరుసుకుంటూ, వెంబనాడు సరసు భూభాగంలో చిన్నా పెద్దా కాలువలుగా అల్లుకుని వుంటుంది. కాలువలను దాటడానికి ముచ్చటైన కఱ్ఱవంతెనలు వుంటాయి మూడు దీవులలో. పొడవైన కఱ్ఱవంతెనను దాటి పొదలమధ్యనున్న కాలిబాట మీద ఆ యువకుడు పాదం మోపినవెంటనే మంత్రగాడిలా ప్రత్యక్షమైనాడు పొడవాటి వ్యక్తి ఒకడు. సన్నగా పొడవుగా ఉన్నాడు. భుజాలవరకూ వ్రేలాడుతున్న జుత్తు సాయంకాలపు గాలులకు నల్లత్రాచు పడగలా కదులుతున్నది. నడుముకు బిగించిన దట్టీలో మూడుమూరల పొడవున నిగనిగలాడుతున్న జాతి కఱ్ఱతో చేసిన

ఖడ్గంలాంటి సాధనం వున్నది. నగిషీలు దిద్దిన దాని మొన అరచేతి పొడవున సూదిలా పదునుగా మెరుస్తున్నది. రెండుచేతులూ నడుమున ఆనించి గుచ్చి గుచ్చి చూస్తూ కరుకైన కంఠంతో మలయాళంలో ప్రశ్నించాడు.

'ఎవరు నువ్వు? ఎక్కడికి వెళ్ళాలి?'

యువకుడు ప్రశాంతంగా చూస్తూ సమాధానమిచ్చాడు. ' జయ జయ రఘువీర సమర్థ! నేనొక సన్యాసిని! రామదాస నామం! మర్మగురు అగస్త్య దర్శనం కోరి వచ్చాను'

ఆ వ్యక్తి ముఖంలో ఎందుకో రంగులు మారాయి. చీదరించినట్లుగా ' రామదాసా? సన్యాసివా?అన్నాడు. పరిహాసం చేస్తున్నట్లు నవ్వుతూ ' సన్యాసికి ధనుర్బాణాలు ఎందుకు?' అన్నాడు.

' ఆత్మరక్షణకు!' సమాధానమిచ్చి దూరంగా దృష్టిని సారించాడు ఆ యువకుడు, సమర్థరాముడు! పొదలు, పూలచెట్ల మాటున, అల్లంత దూరంలో, శాఖోపశాఖలుగా విస్తరించిన విశాలమైన వటవృక్షం కనిపించింది. ఊడల మధ్య లీలగా ఒక కుటీరం కనిపించింది.

హేళనగా నవ్వాడు ఆ వ్యక్తి. 'నాలుగు బాణాలతో ఎంతసేపు ఆత్మరక్షణ చేసుకుంటావు?' అన్నాడు. మరలా ప్రశ్నించాడు 'ఎక్కడినుండి వచ్చావు?'

'నాసిక్ సంగమ క్షేత్రం నుండి వచ్చాను' చిరునవ్వు చెదరకుండా సమాధానమిచ్చాడు సమర్థుడు.

కోపంతో మరింత నల్లగా మాడిపోయింది ఆ వ్యక్తి ముఖం. 'నీచుడా! ఆర్యుడా! ద్రావిడ యుద్ధవిద్యా రహస్యాలు తెలుసుకోడానికి వచ్చావా? ధనుర్బాణాలతో ఆత్మరక్షణ చేసుకుంటావా? ఏదీ, ప్రయత్నించు' అంటూ రెండు పాదాలను ఎడంగా చాచాడు. మోకాళ్ళు కొద్దిగా వంచి, గూడలు వంచి రెండు అరచేతులు నమస్కార భంగిమలో దగ్గరకు చేర్చాడు. మెరుపులా అతడి చేతిలోకి వచ్చింది దట్టీకి బిగించిన పదునైన కొయ్య సాధనం. గాలి పోసుకున్నట్లు బుస బుస పొంగాయి భుజాలు, ఛాతీ కండరాలు. గాలిని చీలుస్తున్నట్లు బుసకొడుతున్నట్లు ధ్వని వెలువడింది అతని కంఠంనుండి. మరుక్షణం ఎవరూ ఊహించని సంఘటన జరిగింది.

యిద్దరి మధ్యనా బుస్సుమంటూ పన్నెండు అడుగుల ఎత్తున పడగ విప్పింది కాటుక రంగులో ఉన్న నల్ల త్రాచు. నీటి పట్టున ఆహారంకోసం బయలుదేరినట్లుంది. తన దారికి అడ్డుగా ఉన్న యిద్దరినీ గమనించి తప్పుకునిపోయే ప్రయత్నంలో ఉన్నది అది. ఆగ్రహంతో ఆ వ్యక్తి చేసిన ధ్వని విని తనమీదకి దాడిగా భావించి నిలువునా పైకి లేచింది. నాలుకలు సాచుతూ కోపంతో ఊగిపోతూ యిరువురినీ గమనించింది. విచ్చుకున్న దాని పడగమీద, పద్నాలుగు అడుగుల పొడవైన శరీరం మీద ముదురు గోధుమ రంగు చారలు మిలమిల లాడుతున్నాయి. బుసలు కొడుతూ ఊగుతూ దాని పడగ తనవైపు మరలినా సమర్థ రాముడు చలించలేదు. నీలి రంగులో మెరుస్తున్న కనులతో పడగ విసరడానికి సిద్ధంగా అది తనను చూస్తుంటే చెదరకుండా శాంతంగా చూపులు కలిపి దాన్నే చూశాడు. క్షణంపాటు అలాగే పడగ వూపుతూ సమర్థ రాముడిని చూసింది అది. వెంటనే పడగతిప్పి అవతలి వ్యక్తిని చూసింది.

అతడి ముఖకవళికలు చూసి దాని మీదికి చేతిలోని ఆయుధాన్ని ప్రయోగించబోతున్నాడని ఊహించాడు సమర్థరాముడు. ఆ కాలనాగు కూడా అతడి కదలికలను గమనించింది. 'మిత్రమా! కదలకు' అని నిదానంగా లోగొంతుకతో సమర్థరాముడు అంటుండగానే మెరుపువేగంతో తన చేతిలోని పదునైన ఆయుధాన్ని దాని పడగమీదకు అతడు దూశాడు. నేర్పుగా అది పడగవంచి పక్కకు తప్పుకున్నది. మరుక్షణంలోనే కెరటంలా తోక చివరన లేచి అతడి మెడమీదికి పడగను పిడుగులా విసిరింది ఆ కాలనాగు. అతడి మెడ నరాలను దానికోరలు అందుకుంటుండగా కనులకు కనిపించని వేగంతో కదిలాడు సమర్థ రాముడు.బాణాన్ని వింటికి తొడగడం, చెవులదాకా నారిని లాగి కొట్టడం, దాని పడగలో దిగబడి గద్దలా తన్నుకుపోయి పొదల అవతల పచ్చికలో ఈకలవరకూ బాణం దిగబడడం కనులు మూసి తెరిచేలోగా జరిగింది!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS